క్లుప్తంగా

115 మందికి కళ్లజోళ్ల అందజేత



ఇంజరంలో ఉచితంగా కళ్లజోళ్లను అందజేస్తున్న వెంకట్రావు దంపతులు

తాళ్లరేవు: కేవీఆర్ అంజలి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 115 మందికి సోమవారం ఉచితంగా కళ్లజోళ్లను పంపిణీ చేశారు. మండల పరిధిలోని ఇంజరం గ్రామంలో ఇటీవల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో సుమారు 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 115 మందికి కళ్లజోళ్లు అవసరమని తేలింది. ఈ నేపథ్యంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు కాకరపర్తి వెంకట్రావు, పూర్ణిమ దంపతులు వాటిని తయారు చేయించి బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు, కిరణ్ కంటి ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



హరిమనోవికాస కేంద్రంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న శ్రీనుబాబు దంపతులు

ఉప్పలగుప్తం: మండలంలోని చల్లపల్లి పంచాయతీ పరిధి జగ్గిరాజుపేటకు చెందిన పెట్టా శ్రీనుబాబు, అశ్విని దంపతుల కుమార్తె శ్రీశరణ్య పుట్టినరోజు సందర్భంగా అమలాపురంలో ఉన్న హరిమనోవికాస కేంద్రంలో 30 మంది మానసిక దివ్యాంగులకు దుప్పట్లు, పండ్లు, స్వీట్లను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బడుగు శ్రీను, కుసుమే వెంకన్న, డాక్టర్ కారెం రవితేజ తదితరులు పాల్గొన్నారు.

వీరేశ్వరస్వామి అన్నదాన ట్రస్ట్‌కు విరాళాలు



దాతలను సత్కరిస్తున్న ఆలయ అధికారులు

ఐ.పోలవరం: నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల వీరేశ్వరస్వామి అన్నదాన ట్రస్టుకు సోమవారం భక్తులు విరాళాలు ఇచ్చారు. కాకినాడకు చెందిన మూసిరెడ్డి జగన్నాథబాబు దంపతులు రూ.10,011, అనపర్తి గ్రామానికి చెందిన పోతంశెట్టి కృష్ణారెడ్డి దంపతులు రూ.10,000 అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు స్వామి చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదం అందించి సత్కరించారు. ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ పేటేటి శ్యామల కుమార్ ఆధ్వర్యంలో దాతలకు ప్రత్యేక దర్శనం చేయించారు. దాతలను ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ అభినందించారు.

నందీశ్వరునికి అభిషేకం



సుంకరపాలెం శివాలయంలో నందీశ్వరునికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

తాళ్లరేవు: త్రయోదశి పర్వదినం సందర్భంగా సుంకరపాలెం భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామివారి ఆలయంలో నందీశ్వరునికి వైభవంగా అభిషేకం నిర్వహించారు. ఆదివారం రాత్రి గ్రామానికి చెందిన దేశింశెట్టి భీమశంకరరావు, వరలక్ష్మి దంపతులచే ఆలయ అర్చకులు భీమేశ్వరశర్మ, ప్రసాదశర్మలు నందీశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

జాతీయ నంది అవార్డు అందుకున్న వెంకటేశ్వరరావు



వెంకటేశ్వరరావుకు అవార్డు అందజేస్తున్న సాహితీ వేదిక ప్రతినిధులు

ఐ.పోలవరం: ప్రముఖ వైజ్ఞానిక సాంస్కృతిక నేత డాక్టర్ పుల్లెపు వెంకటేశ్వరరావు సోమవారం విజయవాడలో జాతీయ నంది అవార్డు అందుకున్నారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డు, నేషనల్ సోషల్ ఆర్గనైజేషన్ సంయుక్తంగా నిర్వహించిన తెలుగు వెలుగు సాహితీ వేదిక కార్యక్రమంలో ఈ అవార్డును అందుకున్నట్టు వెంకటేశ్వరరావు స్థానిక విలేకరులకు తెలిపారు. తెలుగులో వైజ్ఞానిక దృక్పథంతో ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నందుకు ఈ అవార్డు వచ్చిందన్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావును పలువురు అభినందించారు.



సుంకరపాలెంలో వినాయకుడిని నిమజ్జనానికి తీసుకెళుతున్న భక్తులు



ముమ్మిడివరంలో స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు



గౌతమి గోదావరిలో పిళ్లైయ్యార్ స్వామి(లక్ష్మీగణపతి) తెప్పోత్సవం



గణనాథుని శోభాయాత్రలో యువకులు

బై బై గణేశా



యానాంలో గణనాథుని విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు



తాళ్లరేవులో కేశవపురం గణనాథుడిని నిమజ్జనానికి ట్రాక్టరుపై తీసుకెళుతున్న భక్తులు

- ఘనంగా గణపతి నిమజ్జనోత్సవాలు
- ఉత్సాహంగా పాల్గొన్న యువత, మహిళలు

తాళ్లరేవు: తొమ్మిది రోజుల పాటు విశేష పూజలు అందుకున్న గణనాథుని నిమజ్జనోత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. మండల కేంద్రమైన తాళ్లరేవు, సుంకరపాలెం, పోలేకుర్రు, పి.మల్లవరం, ఇంజరం, జార్జిపేట, కోరంగి, పటవల, చొల్లంగి, జి.వేమవరం, గాడిమొగ తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథుల విగ్రహాలకు పూజలు అనంతరం డప్పుల వాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో యువత, మహిళలు ఉత్సాహంగా పాల్గొని తాళ్లరేవు కేశవపురం, కోరంగి పంచాయతీ సీతారామపురం ఆత్రేయ గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. అలాగే పటవల పరిసర ప్రాంతాలకు చెందిన విగ్రహాలను తుల్యభాగ నదిలో, సుంకరపాలెం, ఇంజరం తదితర గ్రామాల విగ్రహాలను గౌతమి గోదావరిలో నిమజ్జనం గావించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ తన సిబ్బందితో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశారు.

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి, ఎస్.కొత్తపల్లి, వానపల్లిపాలెం, ఉప్పలగుప్తం, చల్లపల్లి, విలసవిల్లి, భీమనపల్లి గ్రామాల్లో గణపతి నవరాత్రులు ముగించుకుని సోమవారం ఊరేగింపులు ఘనంగా నిర్వహించారు.

ముమ్మిడివరం: చవితి మహోత్సవాల్లో భాగంగా సోమవారం పలు చోట్ల మహాగణపతి నిమజ్జన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. గణనాథులకు తెల్లవారుజాము నుంచి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి నిమజ్జన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ముమ్మిడివరం పోలీస్ స్టేషన్ సెంటర్, లక్ష్మీగణపతి, రాయుడుపాలెం, టీటీఆర్ నగర్, క్రాప, మట్టాడి వారి పాలెం, గాడిలంకతో పాటు పలు గ్రామాల్లో స్వామివారి నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో జరిపారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉంచి మేళతాళాలతో ఊరేగింపుగా వృద్ధ గౌతమి గోదావరి పాయకు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

అమలాపురం రూరల్: అమలాపురం మండలం ఇందుపల్లి అరవగరువులో బాల భక్త గణపతి సేవా సంఘం ఆధ్వర్యంలో వినాయక చవితి నవరాత్ర ఉత్సవాలు వైభవంగా జరిగాయి. అనంతరం మేళతాళాల మధ్య వినాయకుడిని ఊరేగించి నిమజ్జనం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు టీకే విశ్వనాథ్, శిష్ట భవానీ శంకర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

కాట్రేనికోన: మండలం లక్ష్మీవాడ చవితి వేడుకల్లో చలువ పందిరిలో ప్రత్యేక పూజలు అందుకున్న వరసిద్ధి వినాయకుడికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. గణపతికి అలంకరించిన నోట్ల దండను రూ.3,500కు చొల్లంగి వెంకటేశ్వరరావు దక్కించుకున్నారు. అనంతరం జరిగిన అన్న సమారాధనలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో విత్తనాల రాజేశ్వరరావు, కాండ్రేగుల శ్రీహరి, విత్తనాల సత్యనారాయణ, వాసంశెట్టి సత్యనారాయణ, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో గణపతి నవరాత్ర మహోత్సవాలను పురస్కరించుకుని గణనాథుని నిమజ్జనోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. పట్టణ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి భారీ ఊరేగింపు మధ్య విష్ణాలయం వీధి, చిన్నాసెంటర్, ఆర్ఏఓ ఆఫీసు, బాలయోగినగర్ తదితర ప్రాంతాల మీదుగా గణనాథుని విగ్రహాలు స్థానిక రాజీవ్ రివర్‌బీచ్ గౌతమి గోదావరికి చేరుకున్నాయి. అనంతరం గణనాథుని విగ్రహాలను యానాం అగ్నిమాపక దళ సిబ్బంది, పోలీసు యంత్రాంగం నేతృత్వంలో నిమజ్జనం చేశారు. యానాంలో కొలువైన శ్రీపిళ్లైయ్యార్‌స్వామి వారి బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం రాత్రి నిర్వహించిన తెప్పోత్సవంలో ఆర్ఏఓ మునిస్వామి తదితరులు పాల్గొని విశేష పూజలు నిర్వహించారు.

లడ్డూ నీదా నాదా

- గణపతి నవరాత్రుల సందర్భంగా ఏర్పాటుచేసిన గణేశుడి మండపాల్లో లడ్డూలను వేలం పాటలో దక్కించుకోవడానికి భక్తులు పెద్ద ఎత్తున పోటీ పడుతున్నారు. ఉప్పలగుప్తం మండలంలోని వానపల్లిపాలెం గ్రామంలో ఆదిగణపతి స్వామి వారి ఆలయం వద్ద 9 కిలోల లడ్డూను వేలం వేయగా వల్లభరెడ్డి రాంబాబు అనే భక్తుడు రూ.36,000కు దక్కించుకున్నారు. గొల్లవిల్లి గ్రామ పంచాయతీ పరిధి వాడపర్రు లక్ష్మీగణపతి ఆలయం వద్ద 15 కిలోల లడ్డూను వేలం నిర్వహించగా గొలకోటివారిపాలెం వాస్తవ్యుడు గొలకోటి శేషసాయి రూ.53,500కు దక్కించుకున్నారు.
- కాట్రేనికోన మండలం లక్ష్మీవాడ చవితి వేడుకల్లో చలువ పందిరిలో ప్రత్యేక పూజలు అందుకున్న వరసిద్ధి వినాయకుడి లడ్డూకు ఆలయ కమిటీ వేలం పాట నిర్వహించగా విత్తనాల చిరంజీవి రూ.19,600కు దక్కించుకున్నారు.
- ముమ్మిడివరం మండలం వరగల్లంకలో రామాయణం వెంకటేశ్వరరావు స్వామి వారికి సమర్పించిన 54 కేజీల లడ్డూకు వేలం నిర్వహించగా కోలా లక్ష్మణ స్వామి రూ.30 వేలకు దక్కించుకున్నారు.
- అమలాపురం మండలం ఇందుపల్లి అరవ గరువులో వినాయకుడి లడ్డూ వేలం పాట సోమవారం నిర్వహించారు. ఇందుపల్లి గ్రామానికి చెందిన శిష్ట సుందరరామయ్య, శేషుకుమారి దంపతులు రూ.29,500కు లడ్డూను దక్కించుకున్నారు. మరో లడ్డూను అమలాపురానికి చెందిన పేరి రామకృష్ణ, ఫణికుమారి దంపతులు రూ.23,500కు కైవసం చేసుకున్నారు.



వరగల్లంకలో లడ్డూను వేలం పాటలో దక్కించుకున్న భక్తుడు



లక్ష్మీవాడలో లడ్డూను వేలం పాటలో దక్కించుకున్న విత్తనాల చిరంజీవి



వానపల్లిపాలెంలో లడ్డూను భక్తుడికి అందిస్తున్న కమిటీ సభ్యులు

బాధితులకు మెరుగైన చికిత్స అందించాలి



ఏరియా ఆసుపత్రిలో బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు



కిమ్స్‌లో బాధితులను పరామర్శిస్తున్న శెట్టిబత్తుల రాజబాబు

అమలాపురం రూరల్: అమలాపురం పట్టణం రావుల చెరువు వద్ద బాణసంచా ప్రమాదంలో గాయపడి ఏరియా ఆసుపత్రి, కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఎంపీ హరీష్ మాథుర్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సోమవారం పరామర్శించారు. బాధితులకు మెరుగైన చికిత్స అందించేలా చూడాలని కలెక్టర్ మహేష్‌కుమార్‌ను కోరారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి ప్రమాద కారణాలను తెలుసుకోవాలని అధికారులను ఆదేశించారు.

బాధితులకు పరామర్శ

బాణసంచా పేలుడులో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించి ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకులు శెట్టిబత్తుల రాజబాబు కోరారు. కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను రాజబాబు పరామర్శించారు. ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్ కోరారు. ఆయన క్షతగాత్రులను పరామర్శించారు. అలాగే బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావులు కిమ్స్‌లో బాధితులను పరామర్శించారు. ప్రమాదలంలో గాయపడిన వారందరికీ రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కార్మిక యోధుడు ఏచూరి సీతారామ్

అమలాపురం టౌన్: ఏచూరి సీతారామ్ కార్మిక యోధుడని, ఆయన మరణం కమ్యూనిస్టు లోకానికి తీరని లోటని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆంద్ర మాల్యాద్రి అన్నారు. స్థానిక యూటీఎఫ్ హోమ్‌లో సోమవారం జరిగిన సీతారామ్ సంస్మరణ సభలో మాల్యాద్రి మాట్లాడారు. ఎన్నో ఆదర్శ భావాలున్న సీతారామ్ భారత సీపీఎం పార్టీకి ప్రధాన కార్యదర్శిగా పనిచేయడం మన తెలుగు జాతికే గర్వ కారణమన్నారు. తొలుత సీతారామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు జ్యోతిబసు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పెంకే వెంకటేశ్వరరావు, ఎంటీవీ సుబ్బారావు, జి.దుర్గా ప్రసాద్, పీతల రామచంద్రరావు, టి.నాగవరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సీతారామ్ ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

బొజ్జా తారకం సేవలు ఎనలేనివి

అమలాపురం టౌన్: మానవ హక్కుల కోసం పరితపించిన రాష్ట్ర ఆర్‌పీఐ మాజీ అధ్యక్షుడు బొజ్జా తారకం సేవలు ఎనలేనివని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేడంగి చిట్టిబాబు అన్నారు. స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో పలు పౌర హక్కుల సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం జరిగిన బొజ్జా తారకం 8వ వర్ధంతి సంస్మరణ సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. దళిత విప్లవాల వారధిగా ఉండి తారకం అనేక ప్రజా సమస్యలను హైకోర్టులో పరిష్కారానికి చొరవ చూపారని చిట్టిబాబు గుర్తు చేశారు. కార్యక్రమంలో బొంతు రమణ, విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఐఎస్ మల్లేశ్వరరావు, మానవ హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఏడిద రాజేష్, రాష్ట్ర రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కొండా దుర్గారావు, అమలదాసు బాబూరావు, గిడ్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



బొజ్జా తారకంకు నివాళులర్పిస్తున్న మానవ హక్కుల సంఘాల నేతలు

బాడీ బిల్డింగ్‌లో రమేష్‌కు నాలుగో స్థానం



బాడీ బిల్డింగ్‌లో నాలుగో స్థానం సాధించిన రమేష్

యానాం: ఆంధ్రప్రదేశ్ ఫిట్‌నెస్ బాడీబిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మిస్టర్ ఆంధ్రా ఓపెన్ చాలెంజ్ బాడీ బిల్డింగ్ కప్-2024లో యానాం నియోజకవర్గ శివారు సావిత్రినగర్‌కు చెందిన సంగాడి రమేష్ నాలుగో స్థానం సాధించారు. ఈ సందర్భంగా ఈ నెల 15వ తేదీన ఏలూరు పోలీస్ స్కూల్‌లో 75 కేజీలకు పైబడి జరిగిన పోటీల్లో రమేష్ విశేష ప్రతిభ కనబరిచి సత్తా చాటారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను అభినందించారు.

సీఆర్‌పీ జిల్లా అధ్యక్షుడిగా మీరాసాహెబ్



తాళ్లరేవు: కాకినాడ జిల్లా ఏపీ సీఆర్‌పీడబ్ల్యూ సంఘం నూతన అధ్యక్షుడిగా తాళ్లరేవు మండలంలో పనిచేస్తున్న తరాల మీరాసాహెబ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం కాకినాడ సమగ్ర శిక్ష జిల్లా ప్రాంగణంలో నూతన కార్యవర్గం ఎంపిక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రాంజీ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగింది. సీఆర్ఎంటీ(సీఆర్‌పీ) జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన మీరాసాహెబ్‌ను ఎంపీపీ రాయుడు సునీత, ఎంపీడీఓ ఎం.అనుపమ, ఎంఈఓలు మంగాయమ్మ, ఉమ, సీఆర్ఎంటీలు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా ఈద్ మిలాద్ ఉన్ నబీ



అమలాపురంలో ఊరేగింపు నిర్వహిస్తున్న పట్టణ ముస్లింలు

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణ ముస్లింలు ఈద్ మిలాద్ ఉన్ నబీ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. అనంతరం పుర వీధుల్లో మిలాద్ ఉన్ నబీ జులుస్ ఊరేగింపు జరిపారు. ఈ సందర్భంగా చిన్నారులకు ఉర్దూ, అరబిక్ పాఠ్యాంశాలపై పోటీలు నిర్వహించారు. స్థానిక ముల్లా ముస్తఫా మసీద్ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. చివరగా సోమవారం రాత్రి స్థానిక మసీదులో ఫాతె హాఖాని, ఆమ్ ఖాస్ దావత్ కార్యక్రమాల్లో ముస్లింలు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖాదర్, ముస్లిం పెద్దలు ఎండీ అమీర్, ఎండీ ఆజామ్, ఖ్వాజాబాబు, ఎండీ బషీర్, స్థానిక మున్సిపల్ ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మొయినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాలను విజయవంతం చేయాలి

తాళ్లరేవు: ఈ నెల 17వ తేదీ నుంచి వచ్చే నెల రెండో తేదీ వరకూ మండల వ్యాప్తంగా నిర్వహించనున్న స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ ఎం.అనుపమ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ముఖ్యంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పునర్‌వ్యవస్థీకరణ, వ్యర్థాల నుంచి వినూత్న ఆవిష్కరణలు, శానిటేషన్ డ్రైవ్ ద్వారా ప్రజల్లో చైతన్యం కోసం పలు కార్యక్రమాలు రూపొందించామన్నారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులతో పాటు ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

దర్గాలో దీపారాధన

ముమ్మిడివరం: కొత్తలంక హజరత్ సయ్యద్ అహ్మద్ అలీషా ఖాదర్ వలీబాబా ఉరుసు ఉత్సవాల్లో భాగంగా సోమవారం దీపారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాది మంది హిందూ, ముస్లిం భక్తులు బాబా దర్గాలో బాబా సమాధిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఉదయాన్నే బాబాకు కరాచీ నూకతో తయారుచేసిన ప్రత్యేక ప్రసాదాన్ని సమర్పించి దీపాలతో దర్గాను అలంకరించి పూజలు జరిపారు. ముజఫర్ అలీబాబా కమిటీ సభ్యులు గేదెల రఘునాథ్‌బాబా, నూకల శివ, గేదెల ఉదయ భాస్కర్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. మంగళవారం జయారత్ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

దోమల నియంత్రణకు స్ప్రేయింగ్

అల్లవరం: గ్రామాల్లో దోమల కారణంగా జ్వరాలు పెరిగిపోతున్నాయంటూ ‘విజృంభిస్తున్న జ్వరాలు’ శీర్షిన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. డీఎల్‌పీఓ బొజ్జిరాజు ఆదేశాలతో ఆది, సోమవారాల్లో ప్రత్యేక కార్యక్రమం ద్వారా గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించారు. దేవగుప్తం పంచాయతీ పరిధిలో దోమల నియంత్రణకు ఎబేట్ మందుని పిచికారీ చేపట్టారు. బోడసకుర్రులో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని పారిశుధ్య కార్మికుల సహకారంతో తొలగించి వీధులను శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సాధనాల వెంకటరావు, రొక్కాల విజయలక్ష్మి, కార్యదర్శులు పి.శ్రీనివాస్, దుర్గా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఏఓకి వినతి పత్రం అందజేత

యానాం: విద్యుత్ చార్జిల పెంపునకు నిరసనగా పుదుచ్చేరి వ్యాప్తంగా ఈ నెల 18న బంద్ నిర్వహించనున్న నేపథ్యంలో యానాంలో సైతం బంద్‌కు సహకరించాలని కోరుతూ ఆర్ఏఓ మునిస్వామికి ఇండియా కూటమి నాయకులు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలని, విద్యుత్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఎస్పీ రాజశేఖరన్‌కు సైతం వారు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు అర్ధాని దినేష్, మెల్లం శ్రీను, మోకా బుజ్జి, సీఐటీయూ కార్యదర్శి దుర్గాప్రసాద్, శ్రీమంతులు శ్రీధర్, జార్జి తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌ఏఓ మునిస్వామికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఓజోన్ పొర మానవాళికి రక్షణ కవచం

కొత్తపేట: ఓజోన్ పొర అనేది మానవాళికి రక్షణ కవచమని, దాన్ని కాపాడుకునేందుకు అందరూ బాధ్యతాయుతంగా నడుచుకోవాలని స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పెద్దిరాజు అన్నారు. ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా కళాశాలలో కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రాజు అధ్యక్షతన విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ పెద్దిరాజు మాట్లాడుతూ సూర్యుడి నుంచి వచ్చే ప్రమాదకరమైన అతి నీల లోహిత కిరణాలను భూమి మీద పడకుండా ఓజోన్ పొర ఆపుతుందన్నారు. వాతావరణ సమతుల్యతను కాపాడటంలో ఓజోన్ పొర కీలకపాత్ర పోషిస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోస్టర్ ప్రజెంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి, కెమిస్ట్రీ అధ్యాపకులు డాక్టర్ జి.శ్రీనివాసులు, పి.సాయికృష్ణ, డాక్టర్ డీసీహెచ్ పాపారావు, డాక్టర్ కె.అంకమరావు, సీహెచ్ నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో ఓపీ నమోదు చేసుకోవాలి

యానాం: యానాం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి వచ్చే రోగులు తమ పేర్లను ముందస్తుగా ఆన్‌లైన్‌లో ఓపీ నమోదు చేసుకోవాలని జీజీహెచ్ డిప్యూటీ డైరెక్టర్ రవిశంకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ‘ఓఆర్ఎస్.జీఓవీ.ఇన్’ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని ఓపీ రసీదును పొందొచ్చన్నారు.